# ఆకాశవాణి విజయవాడ కేంద్రం

## ప్రాంతీయ వార్తా విభాగం

## ప్రాంతీయ వార్తలు

**తేది : 27-01-2025** **సమయం : 6.45 గంటలు**

---

# ముఖ్యాంశాలు

1. **గణతంత్ర దినోత్సవం సందర్భంగా రాష్ట్రపతి భవన్, ఉభయ తెలుగు రాష్ట్రాల రాజ్‌భవన్‌లలో 'ఎట్ హోమ్' కార్యక్రమాన్ని నిర్వహించారు.**
2. **తెలంగాణలో అభివృద్ధి, సంక్షేమం కోసం కృషి చేస్తున్నామని ముఖ్యమంత్రి ఏ.రేవంత్‌రెడ్డి వెల్లడించారు.**
3. **రాష్ట్ర ప్రభుత్వం అన్ని రంగాల్లో సమగ్రాభివృద్ధి సాధించే దిశగా పనిచేస్తోందని ఆంధ్రప్రదేశ్ ఉపముఖ్యమంత్రి కె పవన్‌కల్యాణ్ తెలిపారు.**
4. **ఆంధ్రప్రదేశ్‌లో పర్యాటక రంగం అభివృద్ధి కోసం కొత్త విధానాన్ని అమలు చేస్తున్నామని పర్యాటక శాఖ మంత్రి కందుల దుర్గేష్ పేర్కొన్నారు.**
5. **తెలంగాణలో రైతుభరోసా కింద ప్రతి ఎకరాకు 12 వేల రూపాయలు ఇవ్వనున్నామని వ్యవసాయశాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు చెప్పారు.**

==========================

గణతంత్ర దినోత్సవం సందర్భంగా రాష్ట్రపతి ద్రౌపది ముర్ము నిన్న ఢిల్లీలోని రాష్ట్రపతి భవన్‌లో 'ఎట్ హోమ్' కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ఇండోనేషియా అధ్యక్షులు ప్రబోవో సుబియాంటో, ఉపరాష్ట్రపతి జగదీప్ ధన్ ఖడ్, ప్రధానమంత్రి నరేంద్రమోదీ, ఇతర కేంద్రమంత్రులు, పార్లమెంట్ సభ్యులు హాజరయ్యారు. ఈ కార్యక్రమంలో ప్రదర్శించిన కళాత్మక, సాంస్కృతిక అంశాలను అతిథులు ఆస్వాదించారని ఈ మేరకు సామాజిక మాధ్యమం ఎక్స్ ద్వారా తెలిపారు.

-------------------------

గణతంత్ర దినోత్సవం సందర్భంగా నిన్న సాయంత్రం విజయవాడలోని ఆంధ్రప్రదేశ్ రాజ్‌భవన్‌లో 'ఎట్ హోం' కార్యక్రమం జరిగింది. ఈ సందర్భంగా గవర్నర్ జస్టిస్ అబ్దుల్ నజీర్ తేనీటి విందు ఇచ్చారు. ఈ కార్యక్రమంలో ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు, ఆయన సతీమణి భువనేశ్వరి, ఉపముఖ్యమంత్రి కె. పవన్ కల్యాణ్ పాల్గొన్నారు. పలువురు రాష్ట్ర మంత్రులతో పాటు పార్లమెంట్, శాసన సభ్యులు ఇతర అధికారులు ఈ కార్యక్రమానికి హాజరయ్యారు.

మరోవైపు గణతంత్ర దినోత్సవం సందర్భంగా హైదరాబాద్ రాజ్‌భవన్‌లో 'ఎట్ హోం' కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా తెలంగాణ గవర్నర్ జిష్ణుదేవ్ వర్మ తేనీటి విందు ఇచ్చారు. ఈ కార్యక్రమానికి

ముఖ్యమంత్రి ఏరేవంత్‌రెడ్డి, శాసనసభాపతి ప్రసాద్‌కుమార్, హైకోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ సుజయ్ పాల్ సహా పలువురు ప్రముఖులు హాజరయ్యారు.

---------------------------

భిన్నత్వంలో ఏకత్వానికి ప్రతీకగా  భారత గణతంత్ర దినోత్సవ పరేడ్ నిలిచిందని ప్రధానమంత్రి నరేంద్ర మోదీ పేర్కొన్నారు. ఈ అద్భుతమైన కవాతు దేశ  సాంస్కృతిక వారసత్వం, సైనిక పరాక్రమాన్ని ప్రదర్శించిందని సామాజిక మాధ్యమం వేదికగా పేర్కొన్నారు. ఈ వేడుకలో ప్రదర్శించబడిన శకటాలు ఆయా రాష్ట్రాల గొప్ప సంప్రదాయాలను సూచించాయని ప్రధానమంత్రి వెల్లడించారు.

---------------------------

తెలంగాణలో అభివృద్ధి, సంక్షేమం కోసం  కృషి చేస్తున్నామని  ముఖ్యమంత్రి ఏ.రేవంత్‌రెడ్డి అన్నారు. నారాయణపేట జిల్లా కోస్గి మండలం చంద్రవంచలో జరిగిన కార్యక్రమంలో రైతు భరోసా, ఇందిరమ్మ ఆత్మీయ భరోసా, ఇందిరమ్మ ఇళ్లు, కొత్తరేషన్‌కార్డుల పంపిణీ పథకాలను ప్రారంభిస్తూ నిన్న లబ్ధిదారులకు చెక్కులను అందజేశారు. మొత్తం 734 మందికి రైతు భరోసా చెక్కులు, ఇందిరమ్మ ఇళ్ల పథకానికి 11.80 కోట్ల రూపాయల చెక్కులు పంపిణీ చేశారు. అనంతరం జరిగిన సభలో ఆయన  ప్రసంగిస్తూ,. గ్రామాల్లో ప్రజల సమక్షంలో లబ్ధిదారులను ఎంపిక చేస్తున్నామని చెప్పారు. రేషన్‌కార్డు ఉన్న పేదలకు త్వరలోనే సన్నబియ్యం ఇస్తామని ముఖ్యమంత్రి  తెలుపుతూ,

వాయిస్... 22 సెకన్లు

---------------------------

ఉభయ తెలుగు రాష్ట్రాలలో గణతంత్ర దినోత్సవ వేడుకలను ఘనంగా నిర్వహించారు. విజయవాడలోని ఇందిరాగాంధీ మున్సిపల్ మైదానంలో ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర గవర్నర్ ఎస్. అబ్దుల్ నజీర్ జాతీయ జెండాను ఆవిష్కరించారు. పోలీసుల నుంచి గౌరవ వందనం స్వీకరించారు. ఈ సందర్భంగా గవర్నర్ మాట్లాడుతూ... రాష్ట్ర ప్రజలు అభివృద్ధి కోరుకుంటున్నారని, వారి ఆకాంక్షలను నెరవేర్చే దిశగా కూటమి ప్రభుత్వం పని చేస్తోందని అన్నారు. స్వర్ణాంధ్ర విజన్ దిశగా ప్రభుత్వం అడుగులు వేస్తోందని గవర్నర్ వివరించారు.

మరోవైపు సికింద్రాబాద్ పరేడ్ గ్రౌండ్స్ లో జరిగిన గణతంత్ర దినోత్సవ వేడులకలో  తెలంగాణ గవర్నర్ జిష్ణు దేవ్ వర్మ జాతీయ పతాకాన్ని ఎగురవేసి పోలీసుల గౌరవ వందనం స్వీకరించారు గవర్నర్ జిష్ణు దేవ్ వర్మ ఈ సందర్భంగా రాష్ట్ర ప్రజలను ఉద్దేశించి ప్రసంగిస్తూ, తెలంగాణరాష్ట్రాన్ని దేశానికే ఆదర్శంగా నిలిపేందుకు సమిష్టిగా కృషి చేయాలని పిలుపునిచ్చారు.

---------------------------

జనసేన పార్టీ నాయకులు అనవసరమైన వివాదాలు, విభేదాల జోలికి వెళ్లొద్దని ఆ పార్టీ అధ్యక్షులు కె పవన్‌కల్యాణ్ విజ్ఞప్తి చేశారు. ఈ మేరకు  ఆయన జనసేన శ్రేణులకు బహిరంగ లేఖ రాశారు. 'కూటమిలోని మూడు పార్టీలు అత్యంత బాధ్యతాయుతంగా వ్యవహరిస్తూ కూటమి ఆశయాన్ని కాపాడుకోవాలని అన్నారు. సామాజిక మాధ్యమాల్లో వచ్చే అసత్య వార్తలపై,  అంతర్గత విషయాలపై ఎవరూ  స్పందించవద్దని తెలిపారు. రాష్ట్ర ప్రభుత్వం అన్ని రంగాల్లో సమగ్రాభివృద్ధి సాధించే దిశగా  పనిచేస్తోందని తెలిపారు. గత 7 నెలల్లో 3 లక్షల

కోట్ల రూపాయలకు పైగా పెట్టుబడులు రాష్ట్రానికి వచ్చాయని చెప్పారు. మారుమూల గ్రామాల్లోనూ నాణ్యమైన రోడ్లు, మౌలిక సదుపాయాల కల్పనకి ప్రాధాన్యమిస్తున్నామని లేఖలో పేర్కొన్నారు.

---------------------------

ఆంధ్రప్రదేశ్‌లో పర్యాటక రంగం అభివృద్ధి కోసం కొత్త విధానాన్ని అమలు చేస్తున్నామని పర్యాటక శాఖ మంత్రి కందుల దుర్గేష్ తెలిపారు. తూర్పుగోదావరి జిల్లా రాజమహేంద్రవరంలో నిన్న మంత్రి పాత్రికేయులతో మాట్లాడుతూ, పర్యాటక రంగం అభివృద్ధిలో భాగంగా అహోబిలం, నాగార్జున సాగర్ ప్రాజెక్టులను 25 కోట్ల రూపాయలతో అభివృద్ధి చేస్తామని అన్నారు. పరిశ్రమల తరహాలో పర్యాటక రంగంలో రాయితీలను అందిస్తామని మంత్రి పేర్కొంటూ,

వాయిస్ ... 29 సెకన్లు

---------------------------

తెలంగాణలో రైతుభరోసా నగదుని ఈ రోజు నుంచి బ్యాంకుల్లో తీసుకోవచ్చని వ్యవసాయశాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు చెప్పారు. ఖమ్మం జిల్లా రఘునాథపాలెం మండలం మల్లేపల్లిలో నిన్న నిర్వహించిన ప్రజాపాలన గ్రామసభలో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ, ఈ సంవత్సరం రైతుభరోసా కింద ప్రతి ఎకరాకు 12 వేల రూపాయలు ఇవ్వనున్నామని తెలిపారు. మొదటి విడత కింద రైతులకు యాసంగికి పెట్టుబడి సాయం, కూలీలకు 6 వేల రూపాయలు నిన్న అర్ధరాత్రి నుంచే ఖాతాల్లో జమ అవుతాయని తెలిపారు. ఈ రోజు నుంచి బ్యాంకుల్లో నగదు తీసుకోవచ్చని అన్నారు. ప్రతి శాసనసభ నియోజకవర్గానికి ఏడాదికి 3 వేల 500 ఇళ్లు మంజూరవుతాయని మంత్రి వివరించారు.

---------------------------

రైతు సంక్షేమం, ప్రజారోగ్యమే లక్ష్యంగా కేంద్ర ప్రభుత్వం పనిచేస్తోందని రాజమహేంద్రవరం పార్లమెంట్ సభ్యురాలు దగ్గుబాటి పురందేశ్వరి అన్నారు. తూర్పుగోదావరి జిల్లా చాగల్లు మండలం మార్కొండపాడులో కేంద్ర ప్రభుత్వ నిధులతో నిర్మిస్తున్న ప్రజారోగ్య కేంద్రం భవన నిర్మాణానికి ఆమె నిన్న శంకుస్థాపన చేశారు. అనంతరం చాగల్లులో రైతు సేవా కేంద్రం, కచ్చా రోడ్డును ప్రారంభించారు. ఈ సందర్భంగా పురందేశ్వరి మాట్లాడుతూ, దేశంలో 70 ఏళ్లు దాటిన ప్రతి ఒక్కరూ ఆయుష్మాన్ భారత్ కార్డు తీసుకొని 5 లక్షల రూపాయలు వరకు వైద్య సాయం పొందవచ్చన్నారు.

---------------------------

సామాజిక మాధ్యమాల వినియోగం పట్ల బాధ్యతాయుతంగా వ్యవహరించాలని ఆంధ్రప్రదేశ్ పౌరసరఫరాల శాఖ మంత్రి నాదెండ్ల మనోహర్ తెలిపారు. గుంటూరు జిల్లా మంగళగిరిలోని జనసేన పార్టీ కార్యాలయంలో ఉమ్మడి గుంటూరు, ప్రకాశం, రాయలసీమ జిల్లాల్లో ఇటీవల ప్రమాదాల్లో చనిపోయిన 22 మంది జనసేన కార్యకర్తల కుటుంబాలకు 5లక్షల చొప్పున మంత్రి నిన్న చెక్కులను పంపిణీ చేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ, సమిష్టిగా రాయలసీమ, ఉత్తరాంధ్రను అభివృద్ధి చేయడంతోపాటు రాజధాని అమరావతిని నిర్మించుకోవాలని చెప్పారు. విలువలతో కూడిన రాజకీయాలు చేయాలనే ఆలోచనతో జనసేన పార్టీ పనిచేస్తోందన్నారు.

---------------------------

అర్హులైన ప్రతి ఒక్కరికీ సంక్షేమ పథకాలు అందించేందుకు తెలంగాణలోని ప్రజాప్రభుత్వం కృషి చేస్తోందని గృహ నిర్మాణ శాఖమంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి అన్నారు. హనుమకొండ జిల్లా ధర్మసాగర్ మండలం క్యాతంపల్లిలో రైతుభరోసా, ఇందిరమ్మ ఆత్మీయ భరోసా, కొత్త రేషన్‌కార్డులు, ఇందిరమ్మ ఇళ్ల పథకాలను ఆయన నిన్న ప్రారంభించి మాట్లాడారు. పారదర్శకంగా లబ్ధిదారుల ఎంపిక కోసం గ్రామసభలను నిర్వహించి ప్రభుత్వం దరఖాస్తులను స్వీకరిస్తోందని అన్నారు. ప్రస్తుతం మండలానికొక గ్రామంలో ఈ పథకాలను అమలుచేస్తున్నాయని, తర్వాత దశలవారీగా ఇతర గ్రామాలకు విస్తరిస్తామని చెప్పారు.

======================